క్లుప్తంగా

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న అన్ని ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో రాణి లక్ష్మీబాయ్ ఆత్మ రక్షపై సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప జయనగర్ బాలికల పాఠశాలలో గుంటూరు తాడేపల్లి రూపేస్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీఆధ్వర్యంలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో అనిత, రూపేస్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఇన్‌చార్జి సలీం, ప్రిన్సిపల్, ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వీసీకి ఘన సన్మానం



వీసీ ప్రకాశ్‌బాబును సత్కరిస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ప్రకాశ్‌బాబును వైవీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డ, వడలు అందజేసి పట్టు వస్త్రాలతో సత్కరించారు. సోమవారం వర్సిటీలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన వీసీ ప్రకాశ్‌బాబును రాజశేఖర్‌రెడ్డి నాన్ టీచింగ్ ఉద్యోగులతో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు మాబాషా, షబ్బీర్, గంగరాజు, మురళి, నవీన్, రాజశేఖర్, శివప్రసాద్, రామసుబ్బయ్య, పవన్, మల్లేశ్వర్‌రెడ్డి, రాజి, వాసు, సరోజ, పరమేశ్వర్‌రెడ్డి, సుబ్బు, ఫకృద్దీన్, సుబ్బకృష్ణ, బాలయ్య, ప్రభావతి, అశోక్‌రెడ్డి, పవన్, రేణు ప్రసాద్, భీమేష్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఔట్‌రోడ్ స్టేడియంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారు నిర్వహించిన 3వ ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్‌షిప్ 202లో కడప చెమ్మియాపేట కేశవరెడ్డి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ ప్రదర్శనలో 18 గోల్డ్ మెడల్, 10 సిల్వర్ మెడల్స్ సాధించి చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు మాస్టర్ వసీంని పాఠశాల చైర్మన్ కేశవరెడ్డి, ఏజీఎం శ్రీదేవి, డీన్ ద్వార కానాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగజ్యోతి అభినందించారు.

మానవ మనుగడకు సాంకేతిక విజ్ఞానం దోహదం



ప్రాజెక్టు వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న డీజీఎం, డీన్

కడప ఎడ్యుకేషన్ : మానవ మనుగడకు సాంకేతిక విజ్ఞానం ఎంతో ఉపయోగం అని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కడప ఎన్‌జీవో కాలనీలోని నారాయణ ఒలంపియాడ్ అండ్ కో పాఠశాలలో సైన్సు ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి, డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాసులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్ లాంటి అత్యాధునిక రాకెట్ల ప్రయోగం మొదలుకుని నిత్యజీవితంలో ఎన్నో అద్భుతాలకు సైన్సు అవసరం అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జువాలజీ అధ్యాపకురాలు సావిత్రి మాట్లాడుతూ మానవ మనుగడకు సాంకేతిక విజ్ఞానం ఎంతో గుణాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ సైన్సు ఎక్స్‌పో కార్యక్రమాలు పిల్లల్లో నూతన విజ్ఞానాన్ని, పరిపూర్ణ వికాసాన్ని కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షరీఫ్, కో ఆర్డినేటర్ సంపత్, ఎస్‌ఎస్‌టీ విద్యాసాగర్, ఏవో భార్గవ్‌రెడ్డి, సైన్సు విభాగాధిపతులు రవికుమార్, వెంకటేశ్వర్లు, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

కడప ఎడ్యుకేషన్: చిన్నారుల సర్వతో ముఖాభివృద్ధికి అనువైన వసతులు కల్పించి ఆధునిక సాంకేతికతో కూడిన బోధన పద్ధతులను అనుసరిస్తూ పటిష్టమైన ప్రణాళికతో కృషి చేస్తున్నామని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నగరం నాగార్జున మోడల్ స్కూల్లో రినేజాన్స్ పేరిన వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ రవిశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి, భువనేష్‌సాయిరెడ్డిలు ఇతర ఇన్‌చార్జులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు ఒత్తిడికి గురికాకుండా ఆడుతూపాడుతూ ఉత్సాహంగా నేర్చుకునే విధంగా ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రీప్రైమరీ స్కూల్లో కిండర్‌గార్టెన్ పూర్తి చేసిన చిన్నారులకు కాన్వొకేషన్ పట్టాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈశ్వరా.. సర్వేశ్వరా..

- శివ పూజకు వేళాయె
- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- శివరాత్రికి భక్తులతో కళకళ

కడప కల్చరల్ : మహాశివరాత్రి శివ భక్తులకు ఎంతో ప్రియమైనది. ఈ సందర్భంగా భక్తులు శివాలయానికి వెళ్లి మహ దేవుడిని దర్శించుకుని పూజలు చేస్తే పుణ్యం లభిస్తుందని భావిస్తారు. కడప నగరంలో అత్యంత పురాతనమైన శివాలయాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన వాటి గురించి..



మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం

శ్రీ సోమేశ్వరాలయం
(దేవునికడప శివాలయం)

దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం కడప నగరంలో అత్యంత పురాతనమైన ఆలయంగా వెలుగొందుతోంది. సమీపంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన సమయంలోనే దీన్ని కూడా నిర్మించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. జిల్లాలోని పురాతన ఆలయాలలో ఒకటిగా భావించే ఈ ఆలయంలోని స్వామిని సోమేశ్వరుడంటారు. అంతరాలయంలో ఉత్తరాన శ్రీ పార్వతీమాత మందిరం ఉంది. ప్రాంగణంలో ఆలయానికి వెనుకవైపు శ్రీ గణపతి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు ఉన్నాయి.

శ్రీ ప్రసన్న విశ్వేశ్వరాలయం
(మోచంపేట శివాలయం)

కడప పట్టణం ఏర్పడిన కొద్దిరోజుల్లో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతరాలయంలో ఉత్తరాన శ్రీ అన్నపూర్ణదేవి కొలువై ఉన్నారు. ఆలయం వెనుక శ్రీరాముని కోవెల కూడా ఉంది. ప్రాంగణంలో నవగ్రహాల మండపం ఉంది. బిల్వ, మారెడు, జమ్మి, ఉసిరి చెట్లతోపాటు పవిత్ర పుష్పాల మొక్కలు కూడా ఉన్నాయి. ఆలయాన్ని ఇటీవలే పునరుద్ధరించారు. ఇక్కడి పార్వతిమాత సన్నిధిలో బాలలకు అక్షరాభ్యాసాలు చేయిస్తూ ఉంటారు.

మృత్యుంజయేశ్వరాలయం



కడప నగరం మృత్యుంజయకుంటలోని ఈ ఆలయంలో స్వామికి ఉత్తరాన శ్రీ పార్వతిమాత ఆలయం ఉంది. విశాలమైన ప్రాంగణంలో ఈ ఆలయం పర్వదినాల సందర్భంగా భక్తులతో సందడిగా కనిపిస్తుంది. ప్రాంగణంలో దక్షిణాన ఆంజనేయస్వామి ఆలయం, తూర్పున నాగదేవతలు కొలువై ఉన్నారు. కార్తీకమాసమంతా ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు.

శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయం
(గడ్డిబజారు శివాలయం)

స్థానిక గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబదేవి, సోమసుందేశ్వరస్వామి ఆలయానికి 150 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. శిథిలమైన ఈ ఆలయాన్ని భక్తుడు బాలాజీసింగ్ పునర్నిర్మించడంతో దీన్ని బాలాజీ దేవస్థానంగా కూడా పిలుస్తారు. ఈ ప్రాంగణంలో స్వామి ఆలయం ఎదురుగా శ్రీ హనుమంతుని మందిరం ఉంది. ఆ ప్రక్కనే శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం కూడా ఉండడం విశేషం. దసరా, కార్తీకమాసం, శివరాత్రి పండుగల సందర్భంగా ఈ ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తారు. శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు.



శ్రీ అన్నపూర్ణక్షేత్రం

నగరంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ రామచంద్రయ్య కాలనీలోని శ్రీ అన్నపూర్ణేశ్వరి విశ్వేశ్వర స్వామి ఆలయం నిత్యం భక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. ఇక్కడి స్వామిని భక్తులే స్వయంగా అభిషేకించవచ్చు. ఈ క్షేత్రంలో అమ్మవారితోపాటు ఇతర దేవతా మూర్తుల మందిరాలు కూడా ఉన్నాయి. దాదాపు 800 రకాల ఔషధ మొక్కలు, చెట్లతో ఈ క్షేత్రం ఆహ్లాదానికి మారుపేరుగా ఉంది. ముందే సమాచారం ఇస్తే క్షేత్రాన్ని దర్శించుకునే భక్తులకు నిర్వాహకులు ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తారు.



శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం

కడప నగరంలోని నబీకోటలోగల ఈ ఆలయానికి విశేషమైన పేరుంది. ఇక్కడి మల్లికార్జునుడి ప్రక్కనే శ్రీ సర్వమంగళాదేవిమాత కొలువుదీరి ఉన్నారు. ఉత్సవ సమయాల్లో ముఖ్యంగా శివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో ఈ ఆలయంలో స్వర్ణ లింగ దర్శనం ఉంది. ఇక్కడి 108 శివలింగాలతో కూడిన శివస్థూపంపై పర్వదినాలలో భక్తులు దీపాలు వెలిగిస్తారు. ఈ ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్నారు. ప్రతి సోమ, శుక్రవారాల్లో సామూహిక కుంకుమార్చన, సుమంగళి పూజలు నిర్వహిస్తారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



జేసీకి సమస్యను వివరిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

కడప సెవెన్‌రోడ్స్ : అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అబ్దుల్ ఖాదర్, జె.భాగ్యమ్మ, సుధాకర్, సుబ్బారావు, పార్థసారథి కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. సమర్థ అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణను అప్పగించాలన్నారు. తగిన సిబ్బంది, ప్రత్యేక కార్యాలయం ఇవ్వాలన్నారు. యాజమాన్యం బినామి ఆస్తులు కుటుంబ సభ్యుల పేర్లున్న ఆస్తులను జప్తు చేయాలని కోరారు. కేసుల సత్వర పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతమున్న పీపీలను మార్చాలని కోరారు. జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతలను సీఐడీ చీఫ్ పర్యవేక్షణలో మండల రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించాలని చెప్పారు. యాజమాన్యం దోచుకున్న ఆస్తులను రికవరీ చేయాలన్నారు. అగ్రిగోల్డ్‌కు చెందిన భూముల వాస్తవ స్థితిని బట్టి చిన్న సేద్యపు కమతాలుగాను, ఇళ్ల స్థలాలకు పనికి వచ్చే వాటిని చిన్న చిన్న ప్లాట్లుగా చేసి డిపాజిట్ దారులకు, ఇతర కొనుగోలుదారులకు బహిరంగ వేలం ద్వారా విక్రయించాలన్నారు. కంపెనీ నుంచి గతంలో కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్న భూములను, అపార్టుమెంట్ ప్లాట్లను జప్తు నుంచి తొలగించి ఆయా యజమానులకు అప్పగించాలన్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.లక్షలోపు పొదుపు చేసిన డిపాజిట్ దారులకు తగిన చెల్లింపుల కోసం తక్షణ ఏర్పాట్లు చేయాలని విన్నవించారు.

బ్యాంకు లింకేజీ లేకుండా సబ్సిడీ రుణాలివ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : బ్యాంకు లింకేజీతో నిమిత్తం లేకుండా ఎస్సీ, ఎస్టీలకు 85 శాతం సబ్సిడీతో ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షుడు కైపు రామాంజనేయులు కోరారు. రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ భూమి లేని ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి కేటాయించాలన్నారు. ఇవి రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపరిచేలా ప్రభుత్వానికి ప్రతిపాదించాలని కోరారు. ఈ చర్యలు చేపట్టడం వల్ల ఎస్సీ, ఎస్టీల జీవన స్థితిగతుల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సముదాయాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం కార్యక్రమాలు చేపడితే స్వాగతిస్తామన్నారు. ఈ అంశాన్ని తాము రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని జేసీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర యువజనవ విభాగం అధ్యక్షులు మురహరి ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ అనుబంధమైన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి పర్మినెంట్ చేయడంతో పాటు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు బాదుల్లా, నరసింహులు, తారక రామారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కంచుపాటి జాన్, రాజశేఖర్, వెంకటాద్రి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మద్దిలేటి, అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి పనిభద్రత, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత లేదన్నారు. కార్మిక సంఘాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం వచ్చిందని పేర్కొన్నారు. సహజ, ప్రమాద మరణాలు సంభవించినపుడు ఆదుకోవాలన్నారు. అంగవైకల్యం సంభవించినా కూడా బోర్డు ద్వారా చేయూతనివ్వాలన్నారు. సబ్సిడీ రుణాలు, పిల్లల చదువులకు అయ్యే ఖర్చులు, స్కాలర్‌షిప్పులు, వైద్య, గృహ సౌకర్యం అందించాలన్నారు. యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, బాలాజీ, సుబ్బారావు, సిద్దయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించండి

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి న్యాయ పద్ధతిలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 28 అర్జీలు వచ్చాయి. అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

ముమ్మరంగా పూడికతీత కార్యక్రమాలు

కడప నగరంలో సోమవారం సాయంత్రం పెద్ద కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగాయి. శంకరాపురం, బెల్లం అండి ,శాస్త్రి నగర్, చిన్నమాచపల్లి, మోచంపేట, ఏపీహెచ్బీ కాలనీ తదితర ప్రాంతాలలో కాలువల్లో పూడిక తీసి దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. అలాగే పలు ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం కమిషనర్ గౌస్ నగర్ లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు డ్రైనేజీ కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు, కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా 100% ఇంటింటి చెత్త సేకరణ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- కడపకు మంచినీటి సమస్యలు రాకుండా చూడండి
- కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల వినతి



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరానికి తాగునీటిని అందించే పెన్నానదిలో గండివాటర్ వర్క్స్, లింగంపల్లి వాటర్‌వర్క్స్‌ల వద్ద భారీ ఎత్తున జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కోరారు. సోమవారం వారు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్నానదిలో పలు మార్గాల మీదుగా ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగుతోందన్నారు. కడప నగరానికి తాగునీటిని అందించే బోర్లన్నీ పెన్నానదిలోనే ఉన్నాయి కాబట్టి రాబోవు వేసవి కాలంలో నగరానికి తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదముందని హెచ్చరించారు. ఆ పరిస్థితి రాకముందే ఆయా ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా చేయకుండా కట్టడి చేయాలన్నారు. అలాగే నీరు పూర్తిగా ఇంకిపోకముందే మైలవరం నుంచి నీటిని విడుదల చేయించి వేసవి కాలంలో తాగునీటి సమస్యను నివారించాలన్నారు. ఈ మేరకు మైన్స్, పోలీస్ డిపార్ట్ మెంటు వారిని అప్రమత్తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లికార్జున, కె. బాబు, శివకోటిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, సీహెచ్ వినోద్, కంచుపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, నగర మేయర్‌సురేష్‌బాబు

కడప కల్చరల్ : కడప నగరం 44వ డివిజన్‌లోని బలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మూలమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి కనుల పండవగా అలంకరించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పీఠంపై ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబులు అతిథులుగా హాజరయ్యారు. వీరికి నిర్వాహకులు వెల్లాల హేమలత, రామకృష్ణారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి వేదమంత్రోక్తంగా ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, నగర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు

కడప అర్బన్ : కడప నగరానికి చెందిన ఓ యువతిని ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కడప ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కడపకు చెందిన యువతి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తుండేది. కర్నూలు జిల్లాకు చెందిన యువకుడు అదే ఆసుపత్రిలో పని చేస్తుండే వాడు. యువతిని ప్రేమించానంటూ తిరుగుతూ పెళ్లి పేరుతో మోసం చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి

కడప కార్పొరేషన్ : పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుధా కురుబ కోరారు. సోమవారం సాయంత్రం మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తల గురించి వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందడానికి దరఖాస్తు చేయు విధానం, మంజూరు ప్రక్రియ గురించి తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల యజమానులు రమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎం.శేఖర్‌రెడ్డి, ఎస్‌ఎల్‌వీ ప్రసాద్ రెడ్డి, జగన్, ప్రసాద్, సునీల్, గౌస్, అశోక్, శంకర్, అరవింద్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, ఏఐటీయూసీ అనుబంధ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ తొలగింపులు ఎక్కువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న వర్కర్స్ యూనియన్ కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేరీ, నాయకులు లక్ష్మిపార్వతి, శంకరయ్య, గురుదేవి, కుమారి, బాషా, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సీమ'కు జరిగే అన్యాయాలపై గళమెత్తాలి



తవ్వా వెంకటయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్: రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలపై ప్రత్యేకంగా గళమెత్తాల్సిన అవసరం ఉందని యువ రచయిత, విమర్శకుడు, పూర్వ అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య అన్నారు. సాహితీ స్రవంతి, సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ' వద్దొద్దు తరలింపు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సాహితీ స్రవంతి ప్రతినిధి, రచయిత పిళ్లా కుమారస్వామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత పాలకులు రాయలసీమ ప్రాంతం నుంచి అనేక కార్యాలయాలు, సంస్థలు, బోర్డులు, యూనివర్సిటీ, హైకోర్టు తదితర ముఖ్య సంస్థలన్నింటినీ అమరావతికి తరలించడం రాయలసీమ వెనుకబాటుతనాన్ని మరింత పెంచడమేనని విమర్శించారు. సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నాయకుడు రఘునాథరెడ్డి, డాక్టర్ ఓబుళరెడ్డి మాట్లాడుతూ సీమ ప్రజలు తమ చుట్టూ జరిగే అన్యాయాలను ప్రశ్నించాలని, నిలువరించాలని కూడా ఆలోచించలేకపోతున్నారన్నారు. ఈ స్థితి నుంచి బయటపడి రాయలసీమ అభివృద్ధి కోసం, ఉన్న సంస్థలను రక్షించుకోవడం కోసం మేధావులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చింతకుంట శివారెడ్డి, పెద్దిరెడ్డి నీలవేణి, రామాంజనేయులు, హరి, వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు తరలింపును నిరసిస్తూ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు దస్తగిరి రెడ్డి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు శివరాం, గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం



డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు కంటి క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎల్‌వీపీఈఐ వైద్యులు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్ వైఎస్సార్ ప్రాంగణంలో సోమవారం కంటి క్యాన్సర్ సవాళ్లు, చికిత్స అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది క్యాన్సరు ఊపిరితిత్తులు, రొమ్ము, లేదా చర్మానికి సంబంధించినదని అనుకుంటారని, కానీ కళ్లను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. ఎల్‌వీపీఈఐలో అధునాతనమైన వైద్య పద్ధతుల్లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో డాక్టర్లు, నగరవాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని ట్రాఫిక్ సీఐ జువేద్ పేర్కొన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు తదితర వాహనదారులు సీట్ బెల్ట్‌ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భర్తతోపాటు ఐదుగురిపై కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీనగర్‌లో నివాసం వుంటూ ఓ యూట్యూబ్ చానెల్‌లో యాంకర్‌గా విధులను నిర్వహిస్తున్న ప్రసన్న అనే మహిళకు, బద్వేల్‌కు చెందిన శ్రీనివాసులుకు 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో తనను భర్త, బంధువులు వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తతో పాటు, ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఎస్ఐ తాహీర్‌హుసేన్ తెలియజేశారు.